# విమోచనానికి అద్దం పట్టేలా ఫొటో ఎగ్జిబిషన్

## ఛాయాచిత్ర ప్రదర్శన ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

విద్యానగర్, సెప్టెంబర్ 18: హైదరాబాద్ విమోచన ఉదంతాలకు అద్దంపట్టేలా కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఫొటో ఎగ్జిబిషన్ ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్ విమోచన దినాన్ని పురస్కరించుకొని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ సూరునేని ఆధ్వర్యంలో టీఎన్జీవో ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకించారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఫంక్షన్ హాల్ ఎదుట పరిసరాలను చీపురుతో ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి వెంకట రాంబాబు, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించి తిలకిస్తున్న కేంద్ర మంత్రి బండి

**బూత్ కమిటీలకు సన్మానం**

కరీంనగర్‌లోని ఈఎన్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో 80 శాతం అంతకంటే ఎక్కువ పోలింగ్‌ను నమోదు చేయించిన పోలింగ్ బూత్ కమిటీలను గుర్తించి ఘనంగా సన్మానించారు. నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యకర్తల శ్రమ ఫలితంగా తనకు 2 లక్షల 20 వేలకుపైగా మెజారిటీ వచ్చిందన్నారు. అంతకుముందు బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మోదీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బండి సంజయ్ ప్రారంభించారు.

**హాస్టల్ బ్లాకు ప్రారంభం**

హుజూరాబాద్, సెప్టెంబర్ 18: జమ్మికుంట శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో నూతన హాస్టల్ బ్లాకును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ సనాతన సంప్రదాయాలు, సంస్కృతికి అనుగుణంగా విద్యనందిస్తున్న ఏకైక పాఠశాల సరస్వతీ శిశు మందిర్ మాత్రమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, తహసీల్దార్ రమేశ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### బీమా చెక్కు పంపిణీ

విద్యానగర్, సెప్టెంబర్ 18: గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు కరీంనగర్ శాఖలో ఖాతాదారుడైన దారం సంపత్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా, బుధవారం బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో అతడి భార్య ప్రమీలకు రూ. లక్ష బీమా చెక్కును కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అందించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ అశోక్, జూనియర్ ఆఫీసర్ విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE AT KARIMNAGAR
G.W.O.P.No. [ 10 ] of 2024
Between:-
Shubhavani Ganumukkula ...Petitioner.
AND
Ganumukkula Veeraiah & Others ...Respondents.
NOTICE
To,
Whomsoever it may be concerned.
Whereas the Petitioner has instituted the above O.P. against the Respondents under Section 29 of the Guardian and Wards Act R/W Section 8 of the Hindu Minority & Guardianship Act for passing of Decree to declare the Petitioner as Guardian of the Minor namely Krishna Sai Gannumukkula and permitting her to sell the 1/4th undivided share of the Minor property i.e., the RCC roofed Flat No. 503, admeasuring plinth area of 1720 Sft. (including Common area and Car parking area) at Fourth Floor of "BHARGAVI ENCLAVE" and undivided share of land measuring 65.57 Sq.Yards in the site of "BHARGAVI ENCLAVE" situated at Opp: RTC Work-Shop locality of Karimnagar City within the limit of Municipal Corporation, Karimnagar.
Therefore, take Notice that the above O.P. on the file of the Hon'ble I Additional District and Sessions Judge at Karimnagar is posted to 4-10-2024 for your appearance and Counter. In case of default, the above O.P. will be heard and determined in your absence.
// By Order of the Hon'ble I Additional District and Sessions Judge at Karimnagar //
Sd/- E. DILLESHWAR REDDY, Advocate
Karimnagar. Cell: 98662 66733.

### మానవత్వం చాటుకున్న ప్రభుత్వ దవాఖాన సిబ్బంది

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 18: పట్టణంలోని ఏరియా దవాఖానలో గుర్తుతెలియని వ్యక్తికి సపర్యలు చేసి సిబ్బంది మానవత్వం చాటుకున్నారు. ఓ గుర్తుతెలియని వ్యక్తి దవాఖానలో చేరగా.. ఆర్ఎంవో సుధాకర్ ఆదేశాల మేరకు, హాస్పిటల్ శానిటరీ సిబ్బంది ఆయనకు స్నానం చేయించి, అన్నం తినిపించారు. మంచిచెడులు చూసుకున్నారు. ఎంఎన్‌వో శ్రీనివాస్, శానిటేషన్ వర్కర్లు సారయ్య, ప్రహ్లాద్, పేషెంట్ కేర్ ప్రణీతను ఆర్ఎంవో సుధాకర్ ప్రత్యేకంగా అభినందించారు.

**క్రీడలతో మానసికోల్లాసం**

గంగాధర, సెప్టెంబర్ 18 : క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ జోనల్ ఇన్‌చార్జి తిరుపతి అన్నారు. తెలంగాణ స్టేట్ షూటింగ్ బాల్ అసోసియేషన్, యునైటెడ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో మండలంలోని కురిక్యాల ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలలో 43వ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్ 14 షూటింగ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. క్రీడాకారులకు జోనల్ ఇన్‌చార్జి తిరుపతి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థులు సహాన్, పవన్‌ను అభినందించారు. కార్యక్రమంలో డీన్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, షూటింగ్ బాల్ అసోసియోషన్ రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య, జిల్లా అధ్యక్షుడు ముఫాజిల్ పాల్గొన్నారు.

**మరమ్మతు పనుల పరిశీలన**

గంగాధర, సెప్టెంబర్ 18: మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మరమ్మతు పనులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గంగాధర మండల కేంద్రంలో నూతన సబ్ రిజిస్ట్రార్ భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331771-All
LOST
★ HUGO LYNCH, S/o. Harold Lynch, R/o. Hyderabad. Lost Original Regd Sale Deed No. 1644 of 2002. FIR Lost Certificate obtained from Police. If anyone finds, Call: 9849300201.
NT-333062
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

# పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారీకి చర్యలు

- ఈనెల 21 వరకు అభ్యంతరాల స్వీకరణ
- 28న వార్డుల వారీగా తుది జాబితా ప్రచురణ
- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, సెప్టెంబర్ 18: పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఈనెల 13న ముసాయిదా జాబితా ప్రకటించగా, ఈనెల 21 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. 19న మండల స్థాయిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామని, 28న వార్డుల వారీగా తుది జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యులందరి పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చేపట్టిన ప్రక్రియతో పాటు మ్యాపింగ్ కూడా వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలోగల 320 గ్రామ పంచాయతీల్లో 3వేల వార్డులుండగా, 5,26,617 మంది ఓటర్లు ఉన్నట్లు వివరించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

వీరిలో 2,57,038 మంది పురుషులు, 2,69,569 మంది మహిళలు, 10 మంది ఇతరులు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు సిరాజ్ హుస్సేన్, సత్తినేని శ్రీనివాస్, తొడుపునూరి కరుణాకర్, కళ్యాడపు ఆగయ్య, సిరిసిల్ల రాజయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీవి గాడ్సే విధానాలు: టీపీసీసీ చీఫ్

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 18: నరేంద్ర మోదీ గాడ్సే విధానాలు అవలంబిస్తున్నారని, మతాన్ని అడ్డుపెట్టుకొని ప్రధాని అయ్యారని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు చేశారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంతకుముందు పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, పార్టీనాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ ఆరెపల్లి మోహన్, గూడెపు భాస్కర్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు పత్తి కృష్ణారెడ్డి, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, కొల్లూరి కిరణ్ కుమార్, తిప్పారపు సంపత్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

**రాజీవ్ గాంధీని మరిచిన పీసీసీ చీఫ్**

హుజూరాబాద్, సెప్టెంబర్ 18: హుజూరాబాద్ పట్టణానికి వచ్చిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ స్థానిక చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి, సైదాపూర్ రోడ్డులో గల మాజీ ఎంపీ వొడితల రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అయితే హనుమకొండ నుంచి హుజూరాబాద్‌కు వచ్చే రహదారిలోనే డిపో క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి కనీసం పూలమాల వేయకపోవడంపై కాంగ్రెస్ శ్రేణులు విస్మయం చెందుతున్నారు. మహేశ్ కుమార్ గౌడ్ వెంట కారులో ఉన్న నాయకులు కూడా ఎందుకు చెప్పలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రాజేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

**సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ**

జమ్మికుంట(ఇల్లందకుంట), సెప్టెంబర్ 18: జమ్మికుంటకు చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, బుధవారం ఆయన కుటుంబ సభ్యులను పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ రాజయ్య, ఎమ్మెల్యే నాగరాజ్ పరామర్శించారు. వారి వెంట పలువురు నాయకులున్నారు.

### 23లోగా క్రీడాకారులు వివరాలు అందించాలి

కొత్తపల్లి, సెప్టెంబర్ 18 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) ఆదేశాల మేరకు 2019 జనవరి నుంచి జరిగిన రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు తమ వివరాలను ఈనెల 23లోగా జిల్లా యువజన, క్రీడాశాఖ కార్యాలయంలో అందజేయాలని డీవైఎస్‌వో వి. శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులు వారికి సంబంధించిన ప్రశంసాపత్రాలు, సాధించిన పతకాలు, శిక్షకులు, విద్యార్హత, టోర్నమెంట్‌లు, శిక్షణ పొందిన ప్రాంతం, ఇతరత్రా వివరాలను అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9640967943 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### బీజేపీలో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్

విద్యానగర్, సెప్టెంబర్ 18: కరీంనగర్ నగరపాలక సంస్థ 39వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ కొండపల్లి సరిత-సతీశ్ బుధవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. బండి సంజయ్ వారిని పార్టీలోకి ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ

రాంనగర్, సెప్టెంబర్ 18: నగరంలోని రాంచంద్రాపూర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంచంద్రాపూర్ కాలనీకి చెందిన మంచె ప్రకాశ్ ఈనెల 14న ఇంటికి తాళం వేసి పనిమీద వేరే ఊరికి వెళ్లాడు. తిరిగి బుధవారం మధ్యాహ్నం వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు చోరీ జరిగిందని గుర్తించి, ఆధారాల కోసం దర్యాప్తు ప్రారంభించారు. మూడు తులాల బంగారం, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని ప్రకాశ్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సరిలాల్ తెలిపారు.

### బీఆర్ఎస్ నాయకుడిపై కేసు

రాంనగర్, సెప్టెంబర్ 18: గణేశ్ నిమజ్జనం సందర్భంగా నిమజ్జనానికి తీసుకువెళ్తున్న విగ్రహాన్ని అడ్డగించి కులం పేరుతో దూషించి దాడి చేశాడని శ్రీకాంత్ నాయక్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ నాయకుడు చల్ల హరిశంకర్‌పై టూ టౌన్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. తన కాలనీకి చెందిన గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకు వెళ్తూ రాంనగర్‌కు చేరుకోగా, మధ్యాహ్నం సమయంలో చల్ల హరిశంకర్, ఆయన అనుచరులు తమ కాలనీ గణేశుడి విగ్రహానికి అడ్డం వస్తావా అంటూ తనను కులం పేరుతో దూషించి చంపడానికి ప్రయత్నం చేశారని చింతకుంటకు చెందిన గుగులోతు శ్రీకాంత్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చల్ల హరిశంకర్, ఆయన అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

### నల్లబ్యాడ్జీలతో నిరసన

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 18: గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని మొగ్దుంపూర్ మైనార్టీ గురుకుల పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్, జేఏసీ సంయుక్తంగా అధ్యాపకులు, విద్యార్థులు నిరసన తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్, మైనార్టీ గురుకుల విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దేవోజు స్వామి మాట్లాడుతూ, గురుకుల్లాలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచాలని, టైం టేబుల్ మార్చాలని, తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, లెక్చరర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయురాలి కుటుంబానికి ఆర్థిక చేయూత

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 18 : తెలంగాణ సమగ్ర శిక్ష వర్క్, ఆర్ట్, ఫిజికల్ టీచర్స్ ఆధ్వర్యంలో ఇటీవల మృతిచెందిన మానకొండూర్ మండలం గంగిపెల్లి జడ్పీహెచ్ ఉపాధ్యాయిని రజిత కుటుంబానికి జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదుగా ఆర్థిక చేయూత అందజేశారు. రూ. 1.27 లక్షల చెక్కును ఉపాధ్యాయిని కుమార్తె ముడుతనపెల్లి విశ్వాణికి ఇచ్చారు. ఈ సందర్భంగా పీఐటీ ఉపాధ్యాయులు మాట్లాడుతూ, సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి సమగ్ర శిక్ష ఉద్యోగికి జీవిత బీమా రూ. 10 లక్షలు, ఆరోగ్య బీమా రూ. 5 లక్షల సౌకర్యం కల్పించాలని కోరారు.

### మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామం

కొత్తపల్లి, సెప్టెంబర్ 18: ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామమని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శ్రీ మహాలక్ష్మీ పట్టణ సమాఖ్య సమావేశం జరుగగా, చైర్మన్ పాల్గొని మాట్లాడారు. అనంతరం మెప్మా పీడీ స్వరూపా రాణీ మాట్లాడుతూ, సమైక్య సమావేశాలు సక్రమంగా నిర్వహించుకోవాలని, పంచసూత్రాలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు శ్రీవాణి, అరుణ, మానస తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేకు గుడ్డేలుగులపల్లి గ్రామస్తుల వినతి

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం అందిస్తున్న వెలిచాల పరిధిలోని గుడ్డేలుగులపల్లి గ్రామస్తులు

రామడుగు, సెప్టెంబర్18 : వెలిచాల పరిధిలోని గుడ్డేలుగులపల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ప్రకటించాలని గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘం, బాబాజీ సంఘం, ఇందిరమ్మకాలనీ వాసులు బుధవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. వెలిచాలకు సుమారు 2.5 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో గ్రామస్తులకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇక్కడ వెలిచాల మాజీ సర్పంచ్ వీర్ల నర్సింగరావు, రైతుసమన్వయ సమితి మాజీ జిల్లా సభ్యుడు వీర్ల సంజీవరావు, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు తిరుపతి, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు మల్లేశం, మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్, మహిళా సంఘం అధ్యక్షురాలు రజిత, అన్ని కుల సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

### హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం: మిల్కూరి

శంకరపట్నం, సెప్టెంబర్ 18: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు దేశభక్తి ముసుగులో దేశ ప్రజల సంపదను అప్పనంగా ప్రైవేట్ కంపెనీలకు కట్టబెడుతూ మతోన్మాద రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. ఇక ఆరు గ్యారెంటీల అమలుతో ఊదరగొడుతున్న రాష్ట్ర ప్రభుత్వ పనితీరుతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున డెంగ్యూ జ్వరాలు ప్రబలుతున్నందున హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెల్మరెడ్డి రాజిరెడ్డి, నాయకులు సుంకరి సంపత్, కనకం దుర్గాప్రసాద్, చక్రపాణి పాల్గొన్నారు.

### ఈవీఎంల గోదాం సందర్శన

కలెక్టరేట్, సెప్టెంబర్ 18 : కలెక్టరేట్ వెనుకవైపున గల ఈవీఎంల గోదాంను అదనపు కలెక్టర్లు ప్రపుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్ సందర్శించారు. ప్రతి నెలా నిర్వహించే తనిఖీల్లో భాగంగా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.మహేశ్వర్, పలు పార్టీల ప్రతినిధులు మడుపు మోహన్, సత్తినేని శ్రీనివాస్, తొడుపునూరి కరుణాకర్, కళ్యాడపు ఆగయ్య, సిరిసిల్ల రాజయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

### మేదరి కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 18: మేదరి కులస్తుల సమస్యలను పరిష్కరించాలని మేదరి (మహేంద్ర) సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి రాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని సంఘం ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట వెదురుబుట్టలతో ప్రదర్శన చేపట్టారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. నగర అధ్యక్షుడు రమేశ్, నగర మహిళా అధ్యక్షురాలు వాణిశ్రీ, నాయకులు కనకయ్య, ప్రభాకర్, చంద్రమౌళి, రాజనర్సు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఎలక్ట్రికల్ బస్సులను పరిశీలించిన ఈడీ

తెలంగాణచౌక్, సెప్టెంబర్18: జిల్లా కేంద్ర బస్టాండ్ ఆవరణలోని డిపో-2లో గల ఎలక్ట్రికల్ బస్సులను కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్ బుధవారం పరిశీలించారు. చార్జింగ్ పాయింట్ల ఏర్పాటుతో పాటు మౌలిక వసతుల కల్పనకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపో-2 ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డీఎం మల్లయ్య పాల్గొన్నారు.

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రికి టీఎన్జీవోల వినతి

కొత్తపల్లి, సెప్టెంబర్ 18 : కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కు టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పలు అంశాలపై వినతిపత్రం అందించారు. కరీంనగర్‌లో ఉన్న టీఎన్జీవోల కమ్యూనిటీహాల్‌కు ఎంపీ లాడ్స్ ద్వారా రూ.50 లక్షలు మంజూరు చేయాలని, ఉద్యోగుల జాతీయ సమస్యలైన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, ఇన్‌కంట్యాక్స్ పరిధిని రూ.10 లక్షలకు పెంచడం వంటి సమస్యలను పరిష్కరించేలా కృషిచేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు టీఎన్జీవో నాయకులు పేర్కొన్నారు. టీఎన్జీవో సంఘం కార్యదర్శి లక్ష్మణరావు, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, నాగుల నరసింహస్వామి, ప్రభాకర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### మానకొండూర్‌కు గుండ్లపల్లి మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల

గన్నేరువరం, సెప్టెంబర్ 18: మండలంలోని గుండ్లపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలను త్వరలో మానకొండూర్‌కు మార్చుతున్నట్లు ప్రిన్సిపాల్ లవినా తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం ఉంటున్న స్కూల్ బిల్డింగ్‌లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, స్కూల్ మార్పునకు అనుమతి వచ్చినట్టు తెలిపారు.

### విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న ఆకతాయిలు: ఎండుతున్న పంటలు

శంకరపట్నం, సెప్టెంబర్ 18: కేశవపట్నం ఎల్లమ్మ గుడి సమీపంలో ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తరచూ కొందరు ఆకతాయిలు ఆఫ్ చేస్తున్నారు. తాజాగా మంగళవారం నుంచి బుధవారం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఎండలకు పొలాలు ఎండిపోతుండడంతో కొందరు రైతులు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. అయితే అవి రెండూ ఆఫ్ చేసి ఉండడంతో ఎన్‌పీడీసీఎల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఏఎల్ఎం ఆదిబాబు వెంటనే అక్కడకు చేరుకుని పరిశీలించారు. తమకు తెలియకుండా కొందరు ఆకతాయిలు ట్రాన్స్‌ఫార్మర్లు ఆఫ్ చేస్తున్నట్లు అనుమానించారు. వెంటనే సరఫరాను పునరుద్ధరించారు. ఆకతాయిల చర్యలపై శాఖాపరంగా పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది తెలిపారు.

### వినాయక విగ్రహాల ఇనుప స్టాండ్స్, రాడ్లు చోరీపై ఫిర్యాదు

మానకొండూర్, సెప్టెంబర్ 18: ఇటీవల మానకొండూర్ చెరువులో జరిగిన వినాయక నిమజ్జనం సందర్భంగా నిమజ్జనం చేసిన వినాయక విగ్రహాల ఇనుపస్టాండ్స్, రాడ్లు దొంగిలించి, రెండు ట్రాక్టర్లలో